# మమత

-బి.ఎస్.రాములు

"డబ్బు, అధికారం, కులం, స్వార్థం, అంతస్థు ముందు ప్రేమలన్నీ ఉత్తవే" మనసులో మరోసారి అనుకున్నాడు కాంతయ్య.

కాంతయ్య బస్సెక్కుదామని జగిత్యాల కొత్త బస్టాండు ఎదుట గుడిసె హోటల్లో బెంచి మీద కూర్చున్నాడు. పేపరు చూస్తూ బస్టాండు లోపలికి వెళ్తున్న బస్సుల బోర్డులు చూస్తున్నాడు. అతను ఎక్కాల్సిన బస్సులు వస్తున్నాయి —పోతున్నాయి అతను అక్కడినుంచి కదల్లేదు.

ఏది ప్రేమ, ఆ ప్రేమంతా ఎక్కడ పోయింది. ప్రేమ ముందు అన్నీ ఓడిపోతాయి అనుకున్నాడు కాంతయ్య. కాని అలా జరగలేదు. ఇది ప్రేమ అవునా కాదా? అనే అంతస్సంఘర్షణతో అతని బుర్ర బద్దలవుతున్నది. తన ప్రయాణ నిర్ణయం మార్చుకొని పక్కనే ఉన్న పార్కులో కాసేపు కూర్చున్నాడు. కొలిక్కిరాని ఘర్షణతో ఎక్కడెక్కడో తిరిగి ఇంటి దారి పట్టాడు.

కాంతయ్య తల్లి చంద్రమ్మ కొడుక్కోసం ఎదురుచూస్తోంది. "పొద్దట్నించి తినకుండా సరవ్వ వచ్చే వేళకు తప్పించుకొని ఎటెటో తిరుగుతున్నాడు కొడుకు. నాలుగు రోజుల్నించి ఇదే తిరుగుడు" ఏదో గుర్తొచ్చి కొంగుతో కళ్ళొత్తుకుంటూ అనుకుంది చంద్రమ్మ.

కొడుకు కనిపించగానే "సరవ్వ నీకోసం చూసి చూసి పోయె. రాత్రికి మనల్ని బోయినానికి రమ్మన్నది. నేను ఊర్లె కచ్చి అయిదు రోజులాయె అత్తా. కాంతయ్య ఒకసారన్న కలువక పాయె. నేనస్తే కలువక పాయె. మా ఇంటికి రాకపాయె. నేను ఏం పాపం చేసిన అత్తా, నా మొకం జూడకుంట తప్పిచ్చుకుంటుండు అని ఏడ్చింది సరవ్వ" అంది.

కొడుకు కాంతయ్య ముహంలో మారుతున్న రంగులు చూసి నిశ్శబ్దమై పోయింది చంద్రమ్మ. కత్తిరిస్తున్న బీడీల ఆకు పక్కన పెట్టి అన్నం వడ్డించింది. కాంతయ్య ఏదో తిన్నాననిపించి మంచంలో ఒరిగాడు. దుప్పటి కప్పుకుని కళ్ళు మూసుకున్నాడు.

★ ★ ★

"సరూ... నా బతుకిట్లా కావడంలో నీ బాధ్యతేమీ లేదా? నా బతుకిట్లా కావడానికి నీ స్వార్థం కారణం కాదా? రాష్ట్రంలో నువ్విప్పుడు ఒక మేధావిగా ఎదుగుతున్నావు. ఇప్పుడు నిన్ను కలవాలంటేనే భయం. పెళ్ళయినాక నువు చాలా మారిపోయినవు. నీలో అంత ఆత్మవిశ్వాసం ఎలా వచ్చిందో నాకు ఆశ్చర్యం. నీ కళ్ళల్లోని ఆ వెలుగు చూస్తే నాకు బెరుకు. నీకు దూరంగా పారిపోవాలనిపిస్తుంది. కాని అంతలోనే నా సరూ ఎంత ఎదిగిపోయిందో అని సంతోషంతో మనస్సు ఉరకలు వేస్తుంది. సరూ! నువ్వు నాలో ఎందుకు భాగమైపోయావు. నీ ముఖ వర్చస్సులో లోకమంతా తెలుసుకున్నట్టు ఆ తేజస్సు ఎలా వచ్చింది. పెళ్ళయ్యాక నీ నడకలో మరింత నిండుదనం వచ్చింది. పట్నవాసం వల్ల నీ శరీరం నునుపుదేరింది. నీ భాష మారింది. నీ చీరల రంగులు మారినై. నువ్వు ప్యాంటూ షర్టూ వేసుకుంటే నాకు అదోలా ఉంటుంది. అప్పుడు నువ్వు నా సరూవి కాదనిపిస్తుంది. సరూ! నీకు ఈ అభివృద్ధి నీవు స్త్రీవి కావడం వల్ల అందిందా, నీ కులం కారణంగా సాధ్యపడిందా? నీకందిన ఈ అభివృద్ధి, గౌరవం, అంతస్థు నాకు ఎందుకు అందలేదు. మీకు ఇంతలోనే ఇంత బలగం సర్కిల్ ఎట్లా ఏర్పడింది. నా కెందుకు లేదు. మా అమ్మ ఇప్పటికే బీడీలు చేస్తూనే ఉంది. మీ అమ్మేమో ఇప్పుడు బీడీలు బందు చేసి వచ్చినవాళ్ళకు టీ, టిఫిన్లు అందించడానికే టైం చాలక ఆయాసపడుతోంది."

"కాంత్! ముందు నువ్వు పెళ్ళి చేసుకో. నీకంటూ ఒక స్థిరజీవితం ఏర్పడుతుంది. నా వల్లే నీ జీవితం ఇలా అయ్యిందనే అపనింద నుంచి నన్ను తప్పించు."

"అది అపనిందా! నిజం కాదా!" ఇద్దరి మధ్య వాదాలు పెరిగాయి. సరూ కాస్త తగ్గి అనునయంగా అంది. "కాంత్! నీతో ఏకీభవిస్తున్నా. అలా అని ఇలా ఒంటరిగా ఎంతకాలం ఉంటావు. నా మీద నీకు ఏ కాస్త గౌరవం, ప్రేమ ఉన్నా నా మంచి కోసమైనా నువ్వు పెళ్ళి చేసుకో" అంటూ ప్రాధేయపడింది.

## మారిన 'రాశి' జాతకం

ఆమధ్య తల్లిదండ్రులకు తనకు మధ్య వచ్చిన వివాదంతో రాశి తీవ్ర మానసిక సంఘర్షణకు గురయ్యింది. ఆ సంఘటన తరువాత రాశికి బాలకృష్ణ పక్కన నటించే అవకాశాన్ని శ్రీనివాసా ఆర్ట్స్ వారు కల్పించారు. అగ్రహీరో పక్కన నటించే అవకాశం, సురేష్ లాంటి భారీ సంస్థలో నటించే అవకాశం ఆమెకు వచ్చింది.

రామానాయుడు నిర్మించే చిత్రంలో శ్రీకాంత్ పక్కన రాసి నటిస్తోంది. రాశి జాతకం మారే సూచనలు కనిపిస్తున్నాయి.

కాంతయ్య కాసేపటికి ఆ మాటలోని ఔచిత్యాన్ని గుర్తించి అన్నాడు.

"అయితే సరూ —నువ్వే సంబంధాలు వెతుకు. నాకు ఎలాంటి భార్య కావాలో నీ కన్నా బాగా ఎవరికి తెలుసు. పెళ్ళయ్యాక నీలా ఎదగగలిగే జీవితం సాధ్యపడే సంబంధం చూడు. కాని ఇపుడు నీలా ఎదగడం సాధ్యమా! పెళ్లయ్యాక మా బతుకు ఆగిపోయిన బతుకుగా మిగిలిపోతుంది" విషాదంగా అన్నాడు కాంతయ్య.

"కాంత్! కొన్ని విషయాలు కాలంమీద తెల్సి వస్తాయి. కొన్నేమో వయస్సుననుసరించి తెల్సి వస్తాయి. మరికొన్ని విషయాలు అనుభవం మీదో, పెళ్ళయ్యాకో తెల్సి వస్తాయి. బ్రహ్మచారులకు కొన్ని విషయాలు తెలిసే అవకాశం లేదు. పెళ్ళయ్యాక నాలాగే నీలోనూ ఒక స్థిరత్వంతో కూడిన ఆత్మవిశ్వాసం, హుందాతనం వస్తాయి. అపుడు నేనంటే ఇపుడున్న భయమూ, బెరికి తగ్గిపోతాయి. ఒకరి జీవితం మరొకరి జీవితంలా ఉండదు. నీవు —నీ భార్య మా కన్నా ఉన్నతంగా ఎదుగుతారనే నా విశ్వాసం."

"సరూ... మన పెళ్ళి తప్పిపోయినందుకు నీకేమీ బాధ లేదా! ఇంత నిబ్బరంగా ఎలా మాట్లాడగలుగుతున్నావు" ఆశ్చర్యపోయాడు కాంతయ్య.

"కాంత్! కాలం గాయాల్ని మాన్పుతుంది. జ్ఞాపకాలు గాయాల్ని కెలుకుతాయి. కొత్త అనుభవాలు, కొత్త పరిచయాలు, కొత్త జీవితాలు, కొత్త జ్ఞాపకాల్ని సృష్టిస్తాయి. అవి పాత జ్ఞాపకాల్ని మరుగుపరుస్తాయి. ఇపుడు నేనూ —నా భర్త సుఖంగా ఉన్నామంటే ఇది కొత్త జీవితం. ఇవి కొత్త అనుబంధాలు. వీటి అడుగున ఉన్న మన ప్రేమ జ్ఞాపకాలు గుర్తొచ్చి అపుడపుడు విషాదమౌతుంది మనస్సు. కానీ జ్ఞాపకాల కన్నా వర్తమానం ఉన్నతమైంది. పారిపోలేనిది. అందుకే మనస్సుకు ఏకాంతం దొరికితే నీరు తేటపడినట్టు మన జ్ఞాపకాలు పైకి తేలుతాయి. అందుకని మనస్సుకు ఏకాంతం దొర్కకుండా తీరిక లేని పని సృష్టించుకున్నాను. అందులో భాగమే ఈ స్త్రీవాద అధ్యయనం —నువ్వు అంటున్న మేధోతనం."

"అంటే మన ప్రేమ జ్ఞాపకాల్ని చెరిపేస్తున్నావా!"

"కాంత్, నువ్వెందుకలా అపార్థాలు తీస్తావు. నీకెలా అర్థం చేయించాలో తెలీయడం లేదు. పెళ్ళి చేసుకుంటే కొన్నైనా అర్థమవుతాయనుకుంటాను. ఇపుడున్న నా ఈ జీవితం వాస్తవం. ఒక భార్యగా, ఉద్యోగినిగా, తల్లిగా, కొడలిగా ఈ వాస్తవ ప్రపంచంలో నేను జీవించక తప్పదు. అప్పుడే వాస్తవ జీవితం ముందుకొచ్చి క్రమంగా దూరమవుతున్న పాటలా మన ప్రేమ, అనుబంధాలు, జ్ఞాపకాలు శబ్దంలోంచి నిశ్శబ్దంలోకి ప్రవహిస్తాయి."

"సరూ... నువ్వు చాలా మాటలు నేర్చావు. నన్ను మరిచిపోవాలనే నిర్ణయించుకున్నానని స్పష్టంగా చెప్పకుండా ఈ డొంక తిరుగుడెందుకు?"

"కాంత్, అప్పుడు లేచిపోదామంటే నువ్వు ధైర్యం చేయలేదు. అమ్మా, చెల్లీ, ఇంకా ఏదేదో అన్నావు. ఇప్పుడు ఎంతెంత అభాండాలు వేస్తున్నావు. నువ్విలా అంటుంటే నా హృదయంలో ఎంత బాధ కలుగుతున్నదో నీకు తెలుసా? నేనిపుడు సంసారం చేస్తున్న స్త్రీని. ఇపుడు నేను ఓ దేవతా, ఓ పార్వతీ అని ఏడ్చినట్టు ఏడుస్తూ కూర్చుంటే సంతోషమా! స్త్రీలు ఎక్కడో పుట్టి ఎక్కడో నాటేయబడే మొక్కల లాంటివారు. పెళ్ళయ్యాక ఈ వ్యవస్థలో స్త్రీలకు అంతకు క్రితం ఉన్న ప్రేమ విషాదాలు వ్యక్తం నుండి అవ్యక్తం చేయబడతాయి. బాధను సైతం వ్యక్తం చేసే అవకాశం ఈయదు ఈ సమాజం. కొత్త అనుభవాలతో కొత్త జ్ఞాపకాలతో అవ్యక్తాలు కాలక్రమంలో అదృశ్యం అవుతుంటాయి. అవి మనస్సు మీద వేసే ముద్రలు మాత్రం మిగిలిపోతాయి. ఈ ముద్రలే అంతచ్చేతనగా రూపొంది వర్తమానంపై ప్రభావం వేస్తాయంటాడు ఫ్రాయిడ్. అయితే అంతచ్చేతనగా మిగిలే ముద్రల్ని ఎలా తొలగించుకోవచ్చో ధ్యానప్రక్రియలూ, జిడ్డు కృష్ణమూర్తి రచనలూ తెలుపుతాయి."

"ఇపుడు నీ అంతచ్చేతనలోని మన ప్రేమ ముద్రల్ని కూడా తొలగించే ప్రయత్నంలో ఉన్నానన్న మాట."

"ఎంత క్రూరంగా అభాండాలు వేస్తున్నావు కాంత్. బట్టలు వేసుకోవడం తెలియని వయస్సునుండి, సిగ్గంటే ఏమిటో తెలియని పసిప్రాయం నుండి నేను నీకు తెలుసు. నువ్వు నాకు తెలుసు. నాపై నీకూ, నీపై నాకూ ఎంతప్రేమ ఉందో నిర్ధారించడానికి ఇపుడు మనకు సాక్ష్యాలు అవసరమా! సాక్ష్యాల చర్చ ఎందుకు? పెళ్లయిన మూడేళ్లకే నేను మన ప్రేమను మరిచిపోతే దాన్ని ప్రేమంటారా? నా ప్రేమ రోజురోజుకు అవ్యక్తం చేయబడుతోంది." సరూ కన్నీళ్లు తుడుచుకొని తేరుకొని మళ్లీ అంది.

"కాంత్! నేను మునుపటిలా నీతో నవ్వుతూ తుళ్లుతూ స్వేచ్ఛగా ఉండలేను. మీ ఇంటికి మునుపటిలా ఎక్కువగా రాలేను. వస్తే లోకం నిందలు వేస్తుంది. ఇవన్నీ నీకు తెలుసు. కాని నువ్వు మగాడివి కనుక నేను నీతో మునుపటిలా ఉండాలని ఆశిస్తున్నావు. నువ్వు మాత్రం నాతో మునుపటిలా ఉండగలుగుతున్నావా! నేను ఊరినుంచి వచ్చానని తెల్సినా నువ్వు మా ఇంటికి రావు. నేను వస్తే నువ్వు మీ ఇంటిదగ్గర దొరకవు."

"అయితే సరూ! నీలా మరిచిపోవడానికి కాదు. గతం గుర్తొచ్చిన బాధతో."

"కాంత్ బాధతోనే కావచ్చు కాని ఎవరైనా ఏమనుకుంటారో అనే భయం లేకపోతే నీవెందుకు తప్పించుకుంటావు. ఈ సరూ పరాయిది, నా సరూ కాదు అనేకదా దాని అర్థం. ఈ భయం, ప్రేమ ఇద్దరికీ వుంది. నీకు పెళ్లికాలేదు కాబట్టి బాధను వ్యక్తం చేయగలుగుతున్నావు. నీకు పెళ్లయ్యాక నీవూ నీ బాధను వ్యక్తం చేయలేవు. చేస్తే నీ భార్యగానీ, సమాజం గానీ హర్షించదు. నిందలు వేస్తుంది. చులకనగా చూస్తుంది.

"పెళ్లయితే ఏడేళ్ల వయస్సు పెరిగినంత అనుభవం వస్తుందట. నీకుమాత్రం పదిహేనేళ్ల వయస్సు పెరిగినంత అనుభవం పెరిగింది. మీ ఆయన నీకన్నా ఏడేళ్లపెద్ద. సహచర్యంతో అతనితో సమానమైనావు. పెళ్లితో మరో ఏడోళ్ల అనుభవం పెరిగింది. ఇట్లా నీకు మూడేళ్లకే పదిహేనేళ్ల వయస్సూ అనుభవాలూ పెరిగినై. నాకు పెళ్లయితే పెరిగేది ఏడేళ్ల వయస్సే. నా భార్య ఏడేళ్లు చిన్నదైతే నా అనుభవాలు ఆమెతో సమానమై ఏడేళ్లు వెనక్కి తగ్గుతాయేమో...ఎందుకో నీకుతెల్సు. నీ అంత చదువుకున్న అమ్మాయి మా కులంలో నా స్తోమతకు దొరకడం అసాధ్యం."

(ఇంకా ఉంది)

కథ

# మమత

— బి.ఎస్. రాములు

(గత సంచిక తరువాయి)

"అట్లా అయితే కాంత్! నన్ను ఎదిగించినట్టుగా నీ భార్యనీ ఎదిగించుకోవాలి. అది నీ వ్యక్తిత్వ నిర్మాతల్లో నీవొకరివి. నీవు లేకుండా నేను ఇలా ఎదగగలిగేదాన్నా! నీకుతెల్సు. నేను అమ్మ తర్వాత ఎక్కువగా ప్రేమించేది నిన్నే. ఒకందుకు అమ్మ కన్నా నిన్ను ఎక్కువగా ప్రేమిస్తాను."

ఉద్వేగంతో కాంత్ తబ్బిబ్బయిపోతూ అన్నాడు.

"సరూ! అదే నిజమైతే నాకు అంతకన్నా కావాల్సింది లేదు. మన బంధం శరీరాల సంబంధం కాదు. హృదయాల బంధం."

ఆ మాటతో సరూ హృదయం ఉప్పొంగింది. దుఃఖం, ఆవేదన తగ్గి హాయిగా నిర్మలంగా నవ్వింది.

"అబ్బ! ఎంతసేపటికి నీ హృదయపేటిక విప్పావు కాంత్. ఎంతచక్కగా చెప్పావు. అన్నాచెల్లెళ్లు, అక్కాచెల్లెళ్లు, తల్లీపిల్ల మధ్య ఇద్దరు పురుషుల మధ్య, ఇద్దరు స్త్రీల మధ్య ఉండే స్నేహం, ప్రేమ, అనుబంధం స్త్రీపురుషుల మధ్యకూడా ఉంటుంది. దీనికి శరీరాల కలయికతో సంబంధం లేదు. ఇది అర్థమైతే మునుపటిలా నాకు నీవూ, నీకు నేనూ పరస్పరం ప్రేరణగా ఎప్పటికీ కొనసాగడం సాధ్యమే."

"సరూ! నేను అందుకోలేనంతటి ఎత్తులకు ఎదుగుతున్నావు. నా పేదరికం నన్ను ఎదగకుండా అడ్డగిస్తున్నది. కులం ద్వారా ఆయాచితంగా అందివచ్చిన ప్రతిష్ఠా సహకారం నీ ఎదుగుదలలో కల్సి ఉంది. మా కులానికే సోమతు లేదని నీకు తెల్సు స్త్రీగా పుట్టడంవల్ల నీకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలు కలిగినై. నీకన్నా ఎక్కువస్థాయి గల భర్త దొరికి నీ హోదా అకస్మాత్తుగా పెరిగింది.అది మగవాన్నైన నాకెలా సాధ్యం? ఎంతటివారైనా కాంతాదాసులే అనే సామెత ఊరకే పుట్టలేదు. ఇరవైఏళ్ల స్త్రీని యాభయి ఏళ్ల పెద్దమనిషి ఓరచూపు చూస్తే ఆమె దృష్టిలో అతని విలువ జీరో. అట్లా ఎందరో మేధావులను, పెద్దవాళ్లను జీరో చేసుకుంటూపోయే క్రమంలో పెరిగే మీ ఆడవాళ్ల ఆత్మవిశ్వాసం తనకన్నా చిన్నవాళ్లను పెళ్లి చేసుకునే మగవాళ్లకెలా సాధ్య."

"కాంత్! నువ్వన్నదాంట్లో పాయింటు లేకపోలేదు. కాని లక్షలాది పేదస్త్రీలు దేశంలో వ్యభిచారగృహాల్లో మగ్గుతున్నారు. స్త్రీలు రేపులు చేయబడుతున్నారు. ఎంత గొప్ప స్త్రీనైనా కేవలం శరీరంగా చూసే రోతచూపులు పెట్టే ఇబ్బంది, చిత్రహింస నీకర్థం కాదు. కాని నీ చూపులంటే నాకెంతో ఇష్టం. నీ చూపు ఎంత నిర్మలంగా ఉంటుంది. ఎంత ఆత్మీయంగా ఉంటుంది. ఆ చూపులే నువ్వు నిరంతరం నా వెంటే వున్నావనే ఆత్మవిశ్వాసాన్నిస్తుంటాయి. నేను ఏదైనా సాధిస్తే అందులో ప్రధాన వాటా నీకే చెందుతుంది."

"సరూ! మాటలకేంగానీ నీ గౌరవం, ప్రతిష్ఠ నాకెలా వస్తుంది. నీకు అదృష్టం కల్సి వచ్చింది. అంచెలంచెలుగా ఎదిగావు. నీది రహదారి ప్రయాణం. ఒకసారి బాటలో పడిందంటే అదే ముందుకు సాగుతుంది. నాది పిల్ల బాట. ఎగుడుదిగుడు బాట. అవన్నీ అధిగమించి రహదారి చేరేసరికి ఎందరో అలసిపోతారు. నేల రాలిపోతారు. వయస్సు మీరిపోతారు. రహదారి దాకా వచ్చేది ఏ కొందరో... సరూ... మేం మట్టి అయితే మీరు మొక్కలుగా ఎదుగుతున్నారు. మేం ఓడిపోతే మీరు గెలుస్తున్నారు. కృషి మాదైంది, ఫలితం మీదైంది. గెలవాల్సిన వాళ్ల బాట పిల్లబాటగా కుదించుకపోయింది."

"కాంత్! ఏమిటి కొత్త గొంతు. నువ్వు చెప్ప దల్చుకున్నదేదో నాకు అర్థమయ్యేట్టు చెప్పు ప్లీజ్."

"సరూ... అరవై ఏళ్లుగా మీరనుభవిస్తున్న ఉద్యోగ విద్యావకాశాల్లో అధికశాతం మాకు అందకుండా లాక్కున్నవే. జనాభా నిష్పత్తిలో 1932 లో పూనా ప్యాక్టుతో పాటు బీసీ రిజర్వే షన్లు కూడా అమలయి వుంటే మీకీ ఆధిక్యత, అవకాశాలెక్కడివి. మీ ఆయన కన్నా ఉన్నత స్థాయిలో నేనుండేవాడిని కదా! మన పెళ్లిజ రిగి ఉండేది కాదా!"

సరూకు దుఃఖం, కోపం ఒక్కసారిగా ముంచుకొచ్చాయి.

"కాంత్! అప్పుడు నన్ను లేపుకుపోవడం చాతగాలేదు గానీ— ఇపుడు చరిత్ర బరు వంతా మోస్తానని బడాయి దేనికి. మనకు పెళ్లి కానందుకు చరిత్రంతా తవ్వాలా? స్వీయ మానసిక ధోరణితో చరిత్రను క్షణికావే శాలకనువుగా ఎట్లాపడితే అట్లా వ్యాఖ్యానించ వద్దు... ప్లీజ్. అయితే ఒకటి ఒప్పుకుంటాను. నేను సిటీలో ఉండడం వల్ల పుస్తకాలకు, మీడి యాకు, మీటింగులకు దగ్గరగా ఉండడం వల్ల ప్రాచుర్యం తొందరగా వచ్చింది. నువ్వు ప్రజ లకు, వాస్తవాలకు దగ్గరగా ఉన్నా మీడి యాలో మీకు బలమైన వాయిస్ లేనందువల్ల వ్యాప్తిలోకి రాలేకపోయావు. అయితే ఇప్పటికీ నన్ను నువ్వే నడిపిస్తున్నావు. కాని నీ బీసీ మూమెంటు పెరిగేదాకా నన్ను ఇక్కడే ఆగి ఉండాలని కోరుకోవద్దని కోరుతున్నాను. నా కోరిక తప్పు కాదనుకుంటాను."

అలాకాదు సరూ... నీ వ్యక్తిగత అభివృద్ధిని, స్వార్థాన్ని పక్కకుపెట్టి నీవు నావైపు నిలబడి నీ కోసం కాకుండా నా కోసం, నా వారి కోసం ఉద్యమించాలనేది నా కోరిక...డిమాండు."

"కాంత్! నా పరిమితులు నాకున్నాయి. అన్ని పనులు ఒక్కరే చేయలేరు. నీ పని నీవు చేయి. నేను నీ వెంట ఉంటాను."

"సరూ! ఫెమినిజం ముసుగుకింద నీ బోడి కులతత్వ స్వార్థ రాజకీయాలను స్పష్టం చేసు కున్నావు. మగవాళ్ల స్థానంలో మీ ఆడవాళ్ల వస్తే మాకొచ్చే ప్రయోజనం ఏమిటి? చైత న్యం గలవారు చైతన్యంలేని వర్గాలకు చేయూ తనిచ్చి ముందు నడవడం నీ బాధ్యత కాదా! ఈ చారిత్రక కర్తవ్యాల్ని వదిలేసి మీ స్వార్థ ఫెమినిస్టు ప్రయోజనాలకు పరిమితమైన మా చావు మమ్మల్ని చావుమంటావు."

"కాంత్! నీ ఒక్కోమాట నా గుండెల్లో కత్తిలా దిగుతున్నాయి. నాలో నీకిన్నాళ్లు కన బడని అగ్రకులం, కులగజ్జి నీకిప్పుడు కనబ డిందా! ఎంతెంత మాటలంటున్నావు. అపుడు లేచిపోదామంటే పిరికిపందలా పారిపోయి చిత్రహింస పెట్టావు. ఇపుడేమో ఇట్లా... నన్నిట్లా హింసించక ఒక్కసారి చంపేయ రాదూ..." సరూ వెక్కివెక్కి ఏడుస్తోంది.




సరూను ఎలా ఓదార్చాలో కాంతయ్యకు అర్థం కాలేదు. తన చేతకానీతనంపై తనకే చాలా కోపం వచ్చింది. ఒకటి అర్థం చేయించాలనుకుంటే మరొకలా అర్థం చేసుకుంది. సరూ వెక్కివెక్కి ఏడ్వడం చూసి కాంతయ్యకు ఆవేశం చప్పున చల్లారిపోయింది.

"సారీ సరూ... నిన్ను గాయపరచాలని నా ఉద్దేశం కాదు. అరవై ఏళ్ళుగా బీసీల కందాల్సింది అనుభవించి అందులో భాగంగా ఎదిగిన మీ ఆడవాళ్ళూ... మీ ప్రయోజనాలే ప్రధాన స్రవంతై మావి పిల్లకాల్వలుగా మార్చబడుతున్నాయి. స్త్రీలకు అధికారం ముసుగులో బీసీ, ఎస్సీలను వెనక్కి నెట్టి మరో అరవై ఏళ్ళు మీ వాళ్ళే ఆధిపత్యంలో ఉండాలని చేస్తున్న కుట్ర కాదా ఇది! సరూ! నా బాధ నాది, నీ బాధ నీది. నా బాధను నీ కర్థమయ్యేట్టు చెప్పలేకపోయినందుకు నాకు బాధగా ఉంది. నేను ఎవరికి చెప్పుకొని ఏడ్వాలో తెలియడం లేదు."

సరవ్వ కళ్ళు తుడుచుకుని దుఃఖాన్ని అదిమిపట్టి మాటలు కూడగట్టుకొని అంది "కాంత్, మనం ఎప్పటికైనా మళ్ళీ ఒకటి కాగలమనే నా విశ్వాసం. నేను ఓడి నీవు గెలిచినా సంతోషమే. నీవు ఓడితే నేను గెలిచాక నీ గెలుపుకోసం పార్లమెంటుతో సహా అన్ని స్థాయిల్లో మీ రిజర్వేషన్ల కోసం మేమే ఒక రాజ్యాంగ సవరణ తేస్తాము. నా దారి, నీ దారి వేరు కాదు. మనిద్దరిదీ ఒకే దారి. నా హృదయంలో నీ స్థానం ఎప్పటికీ పదిలమైనదే."

★ ★ ★

అపుడే మూడేళ్ళయిపోయింది. కాంతయ్యకు తన ఓటమి, సరవ్వ గెలుపు ఖాయమని తెలిసిపోయింది. కాంతయ్య సరవ్వను అభినందించాల్సింది పోయి అసూయ, ద్వేషం ఎంత వద్దన్నా గూడు కట్టున్నాయి. ఇపుడామె ఉత్తరాలకు జవాబు రాయడం లేదు. ఎన్నిసార్లు సిటీకి రమ్మని పిలిచినా వెళ్ళడం లేదు. సరూ లీవు పెట్టి ఇంటికొచ్చినా తప్పించుకుంటున్నాడు కాంతయ్య.

★ ★ ★

సరవ్వ తన ఇంటి కోడలు కాకుండా పోవడం కొడుకునెంతగా బాధిస్తున్నదో తల్లి చంద్రమ్మనూ అంతే బాధిస్తున్నది. తన చేతుల మీద పెరిగిన పిల్ల. తన కోడలే అని మురిసింది. సరవ్వ తల్లి గౌరమ్మకు, చంద్రమ్మకు మధ్య ఉన్న అనుబంధం అలాంటిది. అది మూడు దశాబ్దాల అనుబంధం.

★ ★ ★

తొమ్మిది పదేండ్ల వయస్సులో చంద్రమ్మ, గౌరమ్మ జగిత్యాలకు కొత్త కోడండ్లుగా వచ్చారు. గౌరమ్మ పెండ్లిలో ఏవో లొల్లులై ఊర్లోని సుట్టాలతో సంబంధాలు తెగిపోయాయి. చంద్రమ్మ, గౌరమ్మ అత్తల మధ్య అనుబంధానికి అది నాంది అయింది. ఒకరికొకరు తోడైనారు. అలా చంద్రమ్మ, గౌరమ్మల స్నేహానికి దారిపడింది. ఇద్దరు ఒకే ఇత్తడి ముంత తీసుకుని చెట్ల చాటుకు దొడ్డికి వెళ్ళే వాళ్ళు. పెద్దమనుషులయ్యారు. ఎవరి సంసారాలు వాళ్ళవైనాయి. అనుబంధాలు పెరిగాయి. ఒకరు ఓరకుంటే మరొకరు ఉడుకు నీళ్ళు పెట్టుడు, స్నానం చేయించుడు, ఎవరి మొగుడు ఎలాంటి వాడో చెప్పుకునుడు, నవ్వుకునుడు. కాంతయ్య కార్తీకపున్నమికి పుట్టాడు. సరవ్వ శివరాత్రికి పుట్టింది. వాళ్ళు కడుపులో ఉన్నపుడే వియ్యాలందుకోవాలని బాసలు చేసుకున్నారు. సరవ్వ పుట్టిన నాలుగేండ్లకు ఎవరినో ఉంచుకుని ఇంటిని నిర్లక్ష్యం చేశాడు తండ్రి. పదేళ్ళు తిరిగాడు. తర్వాత ఎవరినో కూడుకున్నాడు. అన్ని బాధల్లో గౌరమ్మకు చంద్రమ్మే ఊరట. అన్ని పనుల్లో కాంతయ్యే పెద్దకొడుకు.

★ ★ ★

సరవ్వా, కాంతయ్యా ఒకటే క్లాసు. ఒకటే స్కూలు. కచ్చకాయలు, తొక్కుడుబిళ్ళ ఆటల్లో సరవ్వతో పోటీ పడేవాడు కాంతయ్య. మిగిలిన ఆడపిల్లలు కాంతయ్యకు ఆడోలల్ల బోడక్క అని పేరు పెట్టారు. గుడ్డిదీపం వెలుగులో కల్సి చదువుకునేవారు. ఊళ్ళోనే స్కూలు. ఊళ్ళోనే కాలేజీ.

★ ★ ★

ఏమీ పండని భూములకు పోచంపాడు కాల్వల నీళ్ళందాయి. గౌరమ్మ శ్రమతో మంచి పంట భూములయ్యాయి. ఇంటి దగ్గరి పెరడు ఇళ్ళ ప్లాట్లుగా మారాయి. భూముల ధరలు పెరిగాయి. అన్నీ కల్సి వచ్చాయి. భూముల్ని బ్యాంకులో చూపి సరళ తండ్రి ట్రాక్టర్ కొన్నాడు.

(సశేషం)

# మమత

**-బి.ఎస్. రాములు**

(గత సంచిక తరువాయి)

సరళ తండ్రి ఇసుక, ఇటుక కిరాయికి నడిపాడు. కాంతయ్య తండ్రి చేనేత కూలీ గిట్టుబాటు కాక బొంబాయి చేరాడు. దత్తా సామంత్ నడిపిన ఏడాదిన్నర బట్టల మిల్లు సమ్మెతో ఇంటికి చేరాడు. సమ్మెతో ఉన్న పని పోయింది. సైకిల్‌పై బట్టల మూట వేసుకొని ఊళ్ళు తిరిగాడు. ఈ పని తనతో కాదని అరబ్బు దేశాలకు పోతానని అవీ ఇవీ అమ్మి ఎవరి చేతిలోనే పోశాడు.

వాడు మోసం చేశాడు. అదే రందితో తండ్రి పోయాడు. గౌరమ్మ సంసారం కుదుటపడుతుంటే, చంద్రమ్మ సంసారం చితికిపోయింది. సరళ తండ్రి ఉంచుకున్నామె వెంట తిరిగినపుడు లేని మగపెత్తనం ఇంటిపట్టున ఉండడంతో ఇంట్లో కొత్తగా మొదలైంది. సరళ పెండ్లి పట్ల జరాసంధుడయ్యాడు. కాంతయ్య కృష్ణుడు కాలేకపోయాడు. దాంతో సరళ రుక్మిణి కావాలనుకొనీ కాలేకపోయింది. ఆ పాత్రలను చంద్రమ్మ అడ్డుకుంది. ఇపుడు బాధపడుతున్నది.

★ ★ ★

అరుగు మీద ఎవరు లేకపోవడం చూసి "గౌరత్తా" అంటూ ఇంట్లోకి నడిచాడు కాంతయ్య. గౌరమ్మ, మరో ముగ్గురు స్త్రీలు కల్సి రాత్రి భోజనాల కోసం ఏవో అప్పాలు చేస్తున్నారు.

"కాంతూ! ఇన్నాళ్ళకు యాదికొచ్చిందా మా ఇల్లు" ఆప్యాయంగా పలకరించింది గౌరమ్మ. అట్లా బియ్యం బస్తాకు ఒరిగి కూర్చొమంది. మరీ బక్కచిక్కిన కాంతయ్యను చూసి ఎందుకో కళ్ళొత్తుకుంది.

అటూ ఇటూ చూశాడు కాంతయ్య. ఇంట్లోకి వచ్చినప్పటికీ సరవ్వేది అని అడగడానికి కాంతయ్యకు అభిమానం అడ్డొచ్చినట్టుంది. ఆ చూపులు గౌరత్తకు కొత్త కాదు.

"సరవ్వ మీ ఇంటికేయే పోయింది. అందరికీ బోయినాలకు చెప్పి వస్తనన్నది. ఎవలింటి కాడ ఆగిందో. అట్ల అరుగుమీద కూసో. గూట్లె అది తెచ్చుకున్న కొత్త పుస్తకాలున్నాయి. ఇంతట్ల అవి చూస్తుండు" అంది గౌరమ్మ.

వంటింట్లోంచి అరుగు మీదకు వచ్చాడు కాంతయ్య. గూట్లోని పుస్తకాలు విషయసూచికలు తిరగేశాడు. అవన్నీ స్త్రీవాద కోణంలో ప్రపంచ చరిత్రను, మానవ సంబంధాలను, సంస్కృతిని, సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి సంబంధించినవి. ఎక్కువ మేరకు ఇంగ్లీషు పుస్తకాలే. అవన్నీ చూస్తూ కాంతయ్య ఆశ్చర్యపోయాడు. ఆమె జీవితం ఎదుగుదలలో ఎన్ని శిఖరాలో. రహదారులన్నీ ఆమెవే. తనకు ఏ దారీ లేదు. అల్పత్వ భావనతో మనస్సు చిన్నబోయింది. వెళ్ళిపోదామా అని రెండు మూడు సార్లు అనుకున్నాడు కానీ ఎందుకో వెళ్ళలేకపోయాడు. ఇపుడు మాట్లాడుకోకపోతే మళ్ళీ ఎన్నేళ్ళకొస్తుందో... కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకున్నాడు. అతని దీనవదనం కుక్కపిల్ల కుర్చీలో ఒద్దిగా ముడుచుకొని పడుకున్నట్టుగా ఉంది. అతని మనస్సు అల్లకల్లోలంగా ఉంది. బయల్దేరినపుడు కూడగట్టుకున్న ధైర్యం కరిగిపోయింది. అకస్మాత్తుగా లేచాడు. గబగబా బయటకు నడిచాడు. ఎదురొస్తున్న సరవ్వను ఢీకొట్టబోయి ఆగాడు.

"నమస్తే అంకుల్" అంటూ సరవ్వ పెద్ద కూతురు కాంతయ్య దగ్గరకు పరిగెత్తుకొచ్చి చేతులు చాపింది. పాప ఎంతో ముద్దుగా ఉంది. అచ్చం చిన్నప్పటి సరూనే. పాపని ఎత్తుకొని ఆప్యాయంగా ముద్దు పెట్టుకున్నాడు కాంతయ్య.

"మంచిగున్నవా కాంత్" అంటూ సంతోషంగా పలకరించింది సరూ. చిలిపిగా ఆనందంతో కాంతయ్య కళ్ళలో కళ్ళు పెట్టి చూసింది. కాంతయ్యలో ఏదో విద్యుత్తు అణువణువూ ప్రవహించింది. కాంతి నిండిన దేహం ఎంతో తేలికైనట్టనిపించింది. అది కొద్ది క్షణాలే. కాని ఎన్నో ఏళ్ళ దూరాన్ని, విభేదాల్ని తొలగించి వేసింది. మాట రాక కాసేపు పరస్పరం అలాగే చూస్తూ ఉండిపోయారు. తేరుకొని అరుగు మీదకు నడిచారు. కొద్దిసేపట్లోనే కాంతయ్యలోని బెరుకు తగ్గిపోయింది. సరవ్వ మాట్లాడుతుండే భాష మారడాన్ని కాసేపటికి గమనించాడు.

—"సరూ... నువ్వు మల్లా మన పల్లెభాషలో మాట్లాడుతుంటే నాకెంత సంతోషంగా ఉందో తెల్సా. నువ్వు మల్లా నా పాత సరూవే అన్పిస్తున్నది."

"ఇంతకు ముందు మాత్రం నీ పాత సరూని కాదా కాంత్" నవ్వింది సరూ.

"సరూ... నువ్వీ చీరలో ఎంత అందంగా ఉన్నావో... నువ్వా ప్యాంట్లు షర్టు లెందుకేసుకుంటావో కానీ నీ కస్సలు బాగుండవు..."

"అదిగో అదే మగదృష్టి అంటే..." అంటూ

నవ్వింది. ఇలాంటి చీరంటే కాంతయ్యకు ఎంతో ఇష్టమనే కట్టుకుంది సరూ. కాని తన లోని స్త్రీ తాలూకు సహజ ఆసక్తిని బయట పెట్టకుండా మళ్ళీ తనే అంది.

"అయితే కాంత్! నేను మీ అమ్మలా, మా అమ్మలా గోచీ చీర కట్టుకుంటే ఇంకా మంచి గుంటాను కదా. నువ్వేమో ధోవతి కట్టుకొని నెత్తికి రుమాలు చుట్టుకుంటే, నేనేమో సిగల బంతిపూలు పెట్టుకుని మనిద్దరం ఫోటో దిగుదాం. ఎనుకటి జన్మల భార్యాభర్తల్లా భలే ఉంటది గదా. కాని నా బాధేమిటో తెల్సా కాంత్, చీరను మన భారతీయ సంస్కృతి అని మెచ్చుకునే మగవాళ్ళు వారానికో రెండు రోజులైనా చీరెలు కట్టుకొని మన సంస్కృతిని గౌరవించాలని" నవ్వుతూనే చురక అంటించింది సరూ.

"సరూ! పారిశ్రామికీకరణ మీకు ఆధునిక అభివృద్ధిని, నాగరికతను ఇచ్చింది. కాని మా వాళ్ళకు ఉన్న కులవృత్తులు పోగొట్టింది. జీవితాలు కాలే కడుపులతో కొడిగట్టిపోయినై. అంబేద్కర్ ఎందరికో వెలుగు చూపినా గాంధీ పంథాయే రహదారి అయింది. కాని ఈ ఇద్దరికీ గురువైన జ్యోతిబా ఫులే వేసిన బీసీల దారి అక్కడే ఆగిపోయింది."

"చూడు కాంత్, మహాత్మా ఫులే తన భార్యకు అక్షరాలు నేర్పి టీచర్‌గా తీర్చిదిద్దాడు. ఆ సావిత్రిబాయి ఫులే మన దేశంలోని మొదటి మహిళా టీచరు. ఈ ఆదర్శాన్ని నీవెందుకు ముందుకు తీసుకు పోకూడదు. నీ భార్య పద్మ మరీ చదువు రానిదేమీ కాదు. ఇంటర్ చదివిన అమ్మాయిని నీ కనుకూలంగా తీర్చిదిద్దుకోలేకపోతే ఇక సమాజాన్నెలా తీర్చిదిద్దుతావు. ఆమె నీకు చెప్పకుండా పోయింది సరే. మరి నువ్వే పోయి రమ్మని ఎందుకడుగ లేదు. సరవ్వ వల్లనే నా సంసారం గిట్లయిందని మీ ఆవిడ అనుకుంటే ఆ తప్పు ఎవరిది. అలా అనుకోవాలనే నీ ఉద్దేశమా!"

అమ్మ మరీ మరీ కల్సి రమ్మనది సరూతో ఈ మాట చెప్పించడానికేనా! కాంతయ్యకు సందేహం కలిగింది. కాని బయటపడకుండా అదీ ఇదీ మాట్లాడాడు. తనను తాను సమర్థించుకున్నాడు. తన తప్పేమీ లేదన్నాడు.

"చూడు కాంత్! నీవూ, నేనూ చిన్నపిల్లలం కాదు. నిన్ను నీవు ఎంత సమర్థించుకున్నా అసలు విషయం నీ హృదయానికి తెల్సు. కేవలం స్వవిషయాలు పట్టించుకొని సామాజికంగా ఎదగాల్సిన విషయాల్ని పట్టించుకోవడం లేదు. ఇందుకు కారణం నేనే అని నాకు తెలుసు. ఇది తెలిసీ నీ గురించి ఆలోచిస్తూ బాధపడ్తుంటాను. రాగద్వేషాలలో పడిపోయి జీవన సంక్షోభంలో నిరంతరం సంఘర్షణకు లోనవుతున్నప్పటికీ —దశాబ్దాలు గడిచినా మనం ఒకరి భావాలను ఒకరం, ఒకరి ఆశయాలను ఒకరం గౌరవించుకోవడానికి మన ప్రేమే కారణం కదా. జీవితంలో ప్రేమను ఒక చక్కటి అనుభవంగా తీసుకోవాలి. ఆ స్ఫూర్తితో సమాజం కోసం ఒక రచయితగా, కళాకారుడిగా ఎదగాలి. నన్ను ప్రేమించినంతగా సమాజాన్ని ప్రేమించాలి. నీవెంట నేనొక్కదాన్నే ఉండడం కాదు. ఇపుడు పద్మ కూడా మన ఆశయాల్లో, సిద్ధాంతాల్లో భాగం కావడానికి సిద్ధంగా ఉంది. అంధుకు నీవు కొంత త్యాగం చేయాలి."

కాంతయ్యకు సరూ మాటల్లో ఏదో సత్యం ఉందనిపించింది.

★ ★ ★

ఏడాది గడిచింది.

సరూ నుండి వచ్చిన ఉత్తరాన్ని ఆసక్తిగా చదివింది పద్మ.

"ప్రియమైన పద్మకు,

నమస్కారం. మీరు తీసిన పత్రిక తొలి సంచిక అందింది. నీవు ఎడిటర్‌గా, కాంత్ మేనేజర్‌గా ఉండడం సంతోషం కలిగించింది.

ఆ ఉత్తరం గబగబా చదివి లోలోన నవ్వుకుంటూ పద్మ కళ్ళలోకి చిలిపిగా చూస్తూ కాంతయ్య "అబ్బో అక్క మీద ఎంత ప్రేమో. ఇదే రోషం అధ్యయనంలోనూ చూపిస్తే ఎదగడానికి ఎంతో కాలం పట్టదు" అంటూ ఆ ఉత్తరాన్ని తిరిగి ఇచ్చివేస్తూ పద్మ చేతిని ముద్దు పెట్టుకోబోయాడు. పద్మ చురచురా చూస్తూ కసురుకుంది.

అభినందనలు. పత్రిక అంతా బాగుంది. సంపాదకీయం నన్ను దృష్టిలో పెట్టుకొని రాయలేదు కదా అని మనసు పీకుతోంది.

నేనొక పత్రిక సంపాదకవర్గ సభ్యురాలినై ఉండి కూడా మీరొక పత్రిక పెట్టండి అని మీకూ, రజితకూ సూచించని మాట నిజమే. కాని బీసీ, ఎస్సీలు స్వయంగా పత్రికలు తీయాలని సూచించ లేకపోవడంలో అగ్రకుల తత్వం ఉందన్న నీ అభిప్రాయం నన్ను బాధ పెట్టింది. అయినా అగ్ర కులాల వాళ్ళు బీసీ, ఎస్సీలకు చేసే సూచనల్లో ఎదిగిన ప్రాంతాల వాళ్ళు వెనుకబడిన ప్రాంతాల వారికి చేసే సూచనల్లో వారి ఆధిక్యత, ఆధిపత్యం స్థిరపరచుకోవడం కూడా ఉంటుందన్న మాటలో నిజం లేకపోలేదు.

అయితే పద్మా! మీ వ్యక్తిగత జీవితం, సంసారం బాగుపడాలని కోరుకోవడంలో నా ఆధిక్యతా ప్రదర్శనేమీ లేదు. కాంత్ పట్లా, నీ పట్లా ప్రేమ తప్ప నాకు మరో దృష్టి లేదు. మీరు నా వాళ్ళు. నాలో భాగం. నాపై నేను ఆధిక్యతను ప్రదర్శించుకోవడం ఎలా సాధ్యం? కాని మీ సామాజిక జీవితం మా కన్నా ఉన్నతంగా ఎదగాలని ఉన్నప్పటికీ నిర్దిష్టంగా సూచించ లేకపోవడం నా పొరపాటే.

పద్మా! మన స్నేహం అపార్థాల మబ్బులు వీడి పరస్పర సహకారం, ప్రేమ, అనురాగ సంబంధాలు ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. స్వేచ్ఛ, సమానత్వంతో కూడిన ప్రేమ ముందు డబ్బు, అధికారం, స్వార్థం, కులం, మతం అన్నీ వట్టివే —అని బుద్ధుడు ఆచరించి చూపిన మార్గం మనకు ఆదర్శం కావాలి.

మన భావాలను ప్రజల్లోకి తీసికెళ్ళడానికి పత్రిక మనకొక బలమైన ఆర్గనైజర్. అచ్చయిన వాక్యాన్ని వెనక్కి తీసుకోలేము. కనుక అచ్చేసే ముందు ఎంతో సమగ్రంగా సంయమనంతో ప్రతి వాక్యాన్ని తిరిగి తర్కించి చూసుకోవాలి. మీ పత్రిక క్రమం తప్పకుండా వెలువడాలని —మన ప్రాంతం నుండి మరిన్ని పత్రికలు వెలువడాలని కోరుకుంటూ

—మీ సరూ

పద్మకు ఆ ఉత్తరం చదివాక కాంతయ్య మీద బాగా కోపం వచ్చింది. ఆ ఉత్తరాన్ని విసురుగా అతని చేతికిస్తూ అంది పద్మ

"అక్క ఎంత బాగా రాసిందో చూడండి. ఇకనుండి నా పేరు మీద మీరు సంపాదకీయాలు రాయకండి. మీర్రాయాలనుకుంటే మీ కిష్టమైన కలం పేరుతో వ్యాసంగా రాయండి. ఎడిట్ చేసి అచ్చేస్తాను. ఇపుడు చూడండి — సరక్క ఎంతగా నొచ్చుకుందో. ఇకనుండి నా సంపాదకీయాలు నాకొచ్చిన భాషలో నేనే రాసుకుంటాను. మర్చిపోయిన కులతత్వాల్ని రెచ్చగొట్టి మిత్రుల్ని శత్రువులుగా మార్చేసే మీ సంపాదకీయాలకో నమస్కారం."

ఆ ఉత్తరం గబగబా చదివి లోలోన నవ్వుకుంటూ పద్మ కళ్ళలోకి చిలిపిగా చూస్తూ కాంతయ్య "అబ్బో అక్క మీద ఎంత ప్రేమో. ఇదే రోషం అధ్యయనంలోనూ చూపిస్తే ఎదగడానికి ఎంతో కాలం పట్టదు" అంటూ ఆ ఉత్తరాన్ని తిరిగి ఇచ్చివేస్తూ పద్మ చేతిని ముద్దు పెట్టుకోబోయాడు. పద్మ చురచురా చూస్తూ కసురుకుంది.

"వేళాపాళా లేకుండా ముద్దుల ముసుగులో ఈ మగపెత్తనం ఏమిటి? సరక్కా, నేనూ కల్సి ఈ మీ మగపెత్తనంపై యుద్ధం చేస్తాం. నిస్వార్థ ప్రేమ ముందు అధికారం, స్వార్థం, కులం, మతం అన్నీ ఒట్టివే అని నిరూపిస్తాం. మగ మహాశయా! దయచేసి రాజకీయాల కోసం మానవ సంబంధాల్ని బలిపెట్టకండి. ఇదే నేను రెండో సంచికలో రాసే సంపాదకీయం శీర్షిక పేరు."

కాంతయ్య హతాశుడయ్యాడు. "పద్మా, తానూ కల్సి సరూను సాధిద్దామనుకుంటే తన అంచనా తిరగబడింది. ఇపుడు వాళ్ళిద్దరు ఒక్కటై ఇకనుండి తనను సాధిస్తారన్న మాట..." అనుకుంటూ మూతి ముడుచుకొని తల పట్టుకున్నాడు కాంతయ్య.

(అయిపోయింది)